

పునీతం.. అగ్నిగుండ ప్రవేశం

శ్రీకాళహస్తిలోని ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. -8లో



విద్యుదాఘాతంతో ఇద్దరికి గాయాలు

తిరుపతి రూరల్ మండలం అవిలాల శానప్పకాలనీలో విద్యుదాఘాతంతో ఇద్దరు గాయపడ్డారు. -8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	32	24
చిత్తూరు	33	25
తిరుమల	29	21
గూడూరు	35	27
నగరి	33	26

న్యూస్‌రీల్

అంగన్‌వాడీల్లో 'సంపూర్ణ పోషణ'



జయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ అధికారి

తిరుపతి అర్బన్ : జిల్లాలోని అంగన్‌వాడీ పాఠశాలల్లోని చిన్నారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద పౌష్టికాహారం అందిస్తున్నట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి జయలక్ష్మి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఈ నెల నుంచి ప్రతి 15 రోజులకు ఒకసారి గర్భిణులు, బాలింతల ఇంటికే సరుకులు పంపనున్నట్లు వెల్లడించారు. అందులో 3 కేజీల బియ్యం, కేజీ ఎర్ర పప్పు, అర లీటర్ ఆయిల్, 13 కోడిగుడ్లు, 2.5 లీటర్ల పాలు, 2 కేజీలు రాగిపిండి, కేజీ అటుకలు, 250 గ్రాముల బెల్లం, 250 గ్రాముల శనగ లడ్డూలు, 250 గ్రాముల ఖర్జూరం అందజేయనున్నట్లు వివరించారు. జిల్లావ్యాప్తంగా 14,635 మంది గర్భిణులు, 12,499 మంది బాలింతలు, 1,05,099 మంది పిల్లలున్నారని తెలిపారు.

చేపల చెరువులకు అనుమతులు



శ్రీనివాస నాయక్, మత్స్యశాఖాధికారి

తిరుపతి అర్బన్ : జిల్లాలోని మొత్తం 541 చెరువుల్లో చేపలు పట్టుకునేందుకు అనుమతులు మంజూరు చేస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖాధికారి శ్రీనివాస్ నాయక్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 85 సొసైటీలు ఉన్నాయని, వాటి ఆధ్వర్యంలోనే చేపల పెంపకం, పట్టుకోవడం జరుగుతుందన్నారు. చేపలు పట్టుకునే హక్కు పొందిన వారికి 2025 జూన్ 30వ తేదీ వరకు గడువు ఉందని, అయితే ఏటా జూన్ 30వ తేదీలోపు రెన్యూవల్ చేయించుకోవాలని చెప్పారు. అందులో భాగంగా ఇప్పటికే 149 చెరువులకు సంబంధించి నగదు చెల్లించి రెన్యూవల్ చేయించుకున్నారని, మిగిలివాటికి మరో వారంలోపు చెల్లించనున్నారని వెల్లడించారు. సముద్రంలో చేపలు పట్టుకునే మత్స్యకారులు 10వేల మంది ఉన్నారని, చెరువులు, వాగులు, వంకలు, డ్యామ్‌లు, ప్రాజెక్టులపై ఆధారపడి 45 వేల మంది జీవనం సాగిస్తున్నారని వివరించారు. మత్స్యకారులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని, ఫిష్ ఆంధ్ర పథకం కింద రూ.లక్ష నుంచి రూ.50లక్షల వరకు సాయం అందిస్తోందని తెలిపారు.


శాస్త్రోక్తం.. కవచ సమర్పణం



కవచాలు తీసుకువస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్ : శ్రీగోవిందరాజస్వామివారికి నిర్వహించిన జ్యేష్టాభిషేకంలో భాగంగా ఆదివారం స్వామివారికి శాస్త్రోక్తంగా కవచాన్ని సమర్పించారు. ఈ క్రమంలో ముందుగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కవచాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం శత కలశ స్నపన తిరుమంజనం, మహాశాంతి హోమం చేపట్టారు. మధ్యాహ్నం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి వారి ఉత్సవర్లను ఆలయ ఆవరణలోని కల్యాణ మండపానికి వేంచేపు చేసి స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనం తదితర ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. కవచ ప్రతిష్ఠ, అక్షతారోహణం, ఆస్థానం అనంతరం స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా కవచ సమర్పణ చేపట్టారు. సాయంత్రం దేవదేవేరు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓ శాంతి, ప్రధాన అర్చకుడు శ్రీనివాస దీక్షితులు, వైఖానస ఆగమ సలహాదారు మోహన రంగాచార్యులు, ఏఈఓ రవికుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్లు నారాయణ, మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రాధాకృష్ణ, ధనంజయులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా యుపీఎస్సీ పరీక్షలు



నోటీస్ బోర్డు వద్ద అభ్యర్థులు

తిరుపతి అర్బన్: నగరంలో ఆదివారం యూపీఎస్సీ పరీక్షలను ప్రశాంతవాతావరణంలో నిర్వహించారు. మొత్తం 8 కేంద్రాల్లో రెండు సెషన్లలో పరీక్షలు జరిపించారు. అభ్యర్థులకు మెరుగైన వసతులు కల్పించారు. ఉదయం 9.30–11.30 గంటల వరకు జరిగిన పరీక్షకు 3,793 మందికి గాను 1,516 మంది మాత్రమే హాజరయ్యారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 3,953 మందికి గాను 1,503 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు.

అన్నదాతకు అండగా నిలవాల్సిన నేతలు కమీషన్ల కోసం కక్కుర్తిపడ్డారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఏర్పాటు చేసిన ఆల్తూరుపాడు రిజర్వాయర్‌కు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. గత పాలకులు పట్టించుకోకపోగా.. ప్రస్తుతం అక్కడ ఉన్న నేతలు రైతులను రెచ్చగొట్టి ప్రాజెక్టు పనులు సాగకుండా మోకాలడ్డుతున్నారు. చెరువులు లేక.. ఆశల ప్రాజెక్టు పూర్తిగాక స్థానికులు కన్నీటిని దిగమింగుతూ కాలం గడుపుతున్నారు. సాగుకు చుక్కనీరు లేక దిక్కులు చూస్తున్నారు. గుక్కెడు నీటికోసం నానా అవస్థలు పడుతున్నారు. ఆ ప్రాజెక్టు.. కథాకమామిషు ఏంటో మీరే చదవండి.



37వ కిలో మీటరు వద్ద ఎత్తి పోతల పథకానికి ఏర్పాటు చేసిన పంపింగ్



రిజర్వాయర్‌లోకి నీటిని మళ్లించేందుకు నిర్మించిన తూము

అల్లాడుతున్నా ఆనందమే!

కమీషన్ల కోసం కక్కుర్తి

- ఆల్తూరుపాడు రిజర్వాయర్‌ను అడ్డుకున్న టీడీపీ నేతలు
- రెండో దఫా మట్టి సేకరణలో అడుగడుగునా అడ్డంకులు
- టెండర్లు పిలిచినా ముందుకు రాని కాంట్రాక్టర్లు
- సాగు, తాగునీటి కోసం అల్లాడుతున్న ప్రజలు
- ఇదీ ఆల్తూరుపాడులో పరిస్థితి

సాక్షి, తిరుపతి: వెలుగొండ కొండ కింద వెంకటగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల పరిధిలోని 89వేల ఎకరాలకు సాగు, తాగునీరు అందించే లక్ష్యంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సోమశిల–స్వర్ణముఖి (ఎస్ఎస్‌కెనాల్) లింక్ కెనాల్‌కు గతంలో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. 15, 16, 17 ప్యాకేజీల వద్ద అటవీ అడ్డంకులతో పనులు నిలిచిపోయాయి. తర్వాత దివంగత నేత మరణించడం.. తదనంతరం వచ్చిన ప్రభుత్వాలు శ్రద్ధ చూపకపోవడంతో ప్రాజెక్టు పనులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా నిలిచిపోయాయి. గతంలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ నాటి టీడీపీ ప్రభుత్వం ఓట్ల కోసం హడావుడిగా డిజైన్ మార్చి పనులు ప్రారంభించింది. ఈ

కుమ్మక్కు, కుట్రలు

ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులు ఆగిపోయేందుకు ప్రస్తుత ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కారణమని రైతులు ఆరోపిస్తున్నారు. 2018లో అప్పటి వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హడావిడిగా ఆల్తూరుపాడు రిజర్వాయర్‌కు శంఖుస్థాపన చేశారని, అప్పట్లోనే ఈ వ్యవహారంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయని అంటున్నారు. రిజర్వాయర్ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ నుంచి పెద్ద మొత్తంలో మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ కమీషన్లు తీసుకున్నట్లు ప్రచారం చేస్తున్నారు. ఆ తరువాత ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి టీడీపీతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని రైతులను రెచ్చగొట్టి తన పంతం నెగ్గించుకున్నారని మండిపడుతున్నారు.

పనులు కేవలం ఒక్క శాతం మాత్రమే చేసి ఆపేసింది. ఆ సమయంలో కాంట్రాక్టర్ ఆల్తూరుపాడు చెరువు కట్టను తొలగించారు. తర్వాత వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే నిబంధనల మేరకు రిజర్వాయర్ పనులను రద్దు చేసి మళ్లీ రీటెండర్లు నిర్వహించారు. ఈ టెండర్లు బీవీఎస్ఆర్ కంపెనీ 27శాతం లెస్‌తో దక్కించుకుంది. రిజర్వాయర్ కట్ట పనులకు సంబంధించి లింగసముద్రం, మోపూరు, భీముడుచెరువు, పలుగోడు చెరువుల నుంచి 57 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించేందుకు అధికారులు అంచనాలు తయారుచేశారు. చెరువుల నుంచి మట్టిని తరలించే క్రమంలో ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి రైతులను రెచ్చగొట్టారు. ఆపై మట్టిని తరలించకుండా స్థానికులను ఉసిగొల్పారు. దీంతో కొందరు రైతులు అడ్డుకోవడంతో రిజర్వాయర్ పనులు ఆగిపోయాయి.

అర్ధాంతరంగా ఆగిన పనులు

ఆల్తూరుపాడు వద్ద నిర్మిస్తున్న రిజర్వాయర్ విస్తీర్ణం 530 ఎకరాలు. వెలుగొండ కొండలకు దగ్గరగా ఉంది. ఈ రిజర్వాయర్‌కు తెలుగుగంగ నీటిని మళ్లించేందుకు లింగసముద్రం 37వ కిలో మీటర్ నుంచి మూడు కిలో మీటర్ల దూరం పైప్‌లైన్ ఏర్పాటుకు రూ.110.88 కోట్లతో మెగా కంపెనీ పనులను చేజిక్కించుకుంది. ఈ పనులు కిలోమీటరు దూరం పూర్తిచేశారు. ఈ పైప్‌లైన్‌కు సంబంధించి ఇప్పటికే భూ సేకరణ పూర్తయింది. ఎత్తిపోతల పథకానికి సంబంధించిన మోటార్లు, పైప్‌లు సిద్ధంగా ఉన్నాయి. రిజర్వాయర్ పనులు ఆగిపోవడంతో పైప్‌లైను పనులు కూడా నిలిచిపోయాయి.



మట్టిని ఎత్తకుండా అడ్డుకున్న మోపూరు చెరువు ఇదే



రిజర్వాయర్ నుంచి నీటిని పొలాల్లోకి మళ్లించేందుకు ఏర్పాటు చేసిన తూములు



కట్ట పటిష్టతకు తవ్విన కందకం

అల్లాడిపోతున్నాం



ఆల్తూరుపాడు గ్రామంలో ఉన్న చెరువును తొలగించారు. దీనికితోడు రిజర్వాయర్‌ను పూర్తిచేయకపోవడం వల్ల ఐదేళ్లుగా సాగు నీటి కోసం అవస్థలు ఎదుర్కొంటున్నాం. పంటలు పండక కొన్ని కుటుంబాలు వలస వెళ్లిపోయాయి. తాగునీటికీ ఇబ్బందిగా ఉంది.

– పాదిలేటి బలరామిరెడ్డి (ఆల్తూరుపాడు)

వారి వల్లే



ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులు పూర్తయితే నీటికి ఢోకా ఉండదు. ఈ రిజర్వాయర్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల కమీషన్ల కక్కుర్తి వల్ల రిజర్వాయర్ పనులు నిలిచిపోయాయి. అటు చెరువును కోల్పోయి ఇటు రిజర్వాయర్ పూర్తిగాక ఇబ్బందులు పడుతున్నాం.

– గోనా బాలకృష్ణారెడ్డి, ఆల్తూరుపాడు

రేపు చిత్తూరుకు సీఎం రాక

- సభా స్థలిలో ఏర్పాట్లు పరిశీలించిన యంత్రాంగం



సభా స్థలి వద్ద ఏర్పాట్లపై సూచనలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి. చిత్రంలో అధికారులు, ప్రజాప్రతినిధులు

సాక్షి, చిత్తూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం చిత్తూరుకు రానున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో భారీ స్వాగత ఏర్పాట్లు సాగుతున్నాయి. ఎక్కడికక్కడ ఫ్లెక్సీలు, స్వాగత తోరణాలను ఏర్పాటు చేస్తున్నారు. సీఎం జగన్ పాల్గొనే సభా ప్రాంగణంలో వేలాది మంది కూర్చునేందుకు వీలుగా సర్వం సిద్ధం చేస్తున్నారు.

చిత్తూరు డెయిరీకి పూర్వ వైభవం

సీఎం జగన్ చిత్తూరు పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపడుతోంది. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఏర్పాట్లను ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పరిశీలించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్తూరు పర్యటన విజయవంతం చేసేందుకు భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రులు నారాయణస్వామి, పెద్దిరెడ్డి అన్నారు. చిత్తూరు జిల్లాలోని పాడిరైతులకు మేలు చేసేలా మూతపడిన విజయా డెయిరీని అమూల్ ఆధ్వర్యంలో పునః ప్రారంభిస్తున్నట్లు వివరించారు. విజయా డెయిరీకి అమూల్ సంస్థ పూర్వ వైభవం తీసుకొస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అమూల్ డెయిరీ కారణంగా పాల ధరలు పెరిగి పాడి రైతులకు మేలు జరుగుతోందని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ ఎన్నికల హామీల్లో భాగంగా ఈ డెయిరీని పునఃప్రారంభిస్తామని మాటిచ్చి నిలబెట్టుకున్నారని గుర్తు చేశారు. ఇదే సందర్భంగా చీలాపల్లి సీఎంసీ ఆవరణలో 300 పడకల ఆస్పత్రి కారణంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. జేసీ శ్రీనివాసులు, డీఆర్వో ఎన్.రాజశేఖర్, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్, అడిషనల్ ఎస్పీలు శ్రీలక్ష్మీ, సుధాకర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి, ఆర్డీఓ రేణుక, చుడా చైర్మన్ పురుషోత్తం రెడ్డి, నగర డిప్యూటీ మేయర్ చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పకడ్బందీ భద్రత



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి

రేణిగుంట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం పర్యటించనున్న నేపథ్యంలో రేణిగుంట ఎయిర్‌పోర్టు వద్ద పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఈ మేరకు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ 4వ తేదీ ఉదయం 9.15 గంటలకు ముఖ్యమంత్రి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారన్నారు. 9.25కి హెలికాప్టర్‌లో చిత్తూరుకు బయలుదేరి వెళతారన్నారు. అక్కడ వివిధ కార్యక్రమాల్లో పాల్గొని మధ్యాహ్నం 2.05కి రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకుని, 2.15 గంటలకు గన్నవరం తిరుగుప్రయాణమవుతారని వివరించారు. ఈ క్రమంలో అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు అప్రమత్తంగా బందోబస్తు విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ డీకే బాలాజీ, శ్రీకాళహస్తి ఆర్డీఓ కేఎస్ రామారావు, ఏయిర్‌పోర్టు సీఎస్ఓ రాజశేఖర్ రెడ్డి, డిప్యూటీ కమాండెంట్ కున్వర్ బహదూర్, ఏఎస్పీలు కులశేఖర్, విమల కుమారి, జిల్లా అగ్నిమాపకశాఖాధికారి రమణయ్య, డీఎస్పీలు భవ్యశ్రీ, యశ్వంత్, రవీంద్రరెడ్డి, రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవి ప్రభు, స్విమ్స్ సీఎంఓ శివశంకర్, జిల్లా ఆర్అండ్‌బీశాఖాధికారి సుధాకర్ రెడ్డి, రేణిగుంట తహసీల్దార్ ఉదయ సంతోష్, పాల్గొన్నారు.

జన సురక్ష

ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు సుబ్బమ్మ. పాల సముద్రం మండలం వనదుర్గాపురంలో నివసిస్తున్నారు. కూలి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వనదుర్గాపురం సచివాలయంలో తొలిరోజు నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపులో కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను పొందారు. ఈ సర్టిఫికెట్ల కోసం రూ.500 వరకు ఖర్చు చేసి, మీ సేవ కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండేది. నాలుగు రోజుల క్రితం జగనన్న సురక్ష పథకంలో భాగంగా తన ఇంటికి వెళ్లిన వలంటీర్లు కుల ధ్రువీకరణ పత్రం అవసరమని గుర్తించి దరఖాస్తు చేయించారు. సర్టిఫికెట్లను పొందడంతో ఎంతో మేలు కలిగిందని సుబ్బమ్మ ఆనందం వ్యక్తం చేసింది.



సర్టిఫికెట్‌ను చూపుతున్న సుబ్బమ్మ



తిరుపతిలో ధ్రువీకరణపత్రాలు పొందిన లబ్ధిదారులు

ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రజల వినతులను సంతృప్తి స్థాయిలో పరిష్కరించడం కోసం చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో షెడ్యూల్ ప్రకారం ఆయా సచివాలయాల్లో క్యాంపులను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు 1వ తేదీన నిర్వహించిన క్యాంపులకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. జగనన్న సురక్ష క్యాంపుల వల్ల తమకు మేలు కలిగిందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 3న పలు మండలాల్లోని సచివాలయాల్లో క్యాంపులు నిర్వహించనున్నారు.

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా క్యాంపులు
- పర్యవేక్షిస్తున్న కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్‌లు
- జగనన్న సురక్ష క్యాంపులకు అద్భుతమైన స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు, వివిధ ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ సేవలను జగనన్న సురక్ష క్యాంపులలో పరిష్కరిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న సురక్ష క్యాంపులకు విశేష స్పందన లభిస్తోంది. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రతి ఒక్కరి సమస్యలను పరిష్కరించడం కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రజల ముందుకు తీసుకొచ్చింది. చిత్తూరు జిల్లాలో నిర్వహిస్తున్న క్యాంపులను కలెక్టర్ షణ్మోహన్, తిరుపతి జిల్లాలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి పర్యవేక్షిస్తున్నారు. మండల స్థాయి అధికారులు తహసీల్దార్, ఈవోపీఆర్డీ, ఎంపీడీవో, తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్లు క్యాంపులలో పాల్గొంటున్నారు.

ప్రజలకు ఉచితంగా సేవలు

సురక్ష క్యాంపులలో ప్రజలకు ఉచితంగా 11 రకాల సేవలందిస్తున్నారు. జగనన్న సురక్షలో కుల, ఆదాయ, వివాహ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కు మొబైల్ నంబర్ అనుసంధానం, మ్యూటేషన్ లావాదేవీలు, ఫ్యామిలీ మెంబర్ల సర్టిఫికెట్, పంట సాగుహక్కు పత్రం, కొత్త రేషన్ కార్డులు, హౌస్ హోల్డింగ్ మ్యాప్ వంటి 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తున్నారు. అక్కడికక్కడే ప్రజలకు సర్టిఫికెట్‌లను అందిస్తున్నారు. ఈ నెల 1న చిత్తూరు జిల్లాలో 45 సచివాలయాల్లో, తిరుపతి జిల్లాలో 35 సచివాలయాల్లో క్యాంపులు నిర్వహించారు. చిత్తూరు జిల్లాలో 41,666, తిరుపతి జిల్లాలో 33,924 కుటుంబాలకు మేలు కలిగిందని అధికారులు వెల్లడించారు. చిత్తూరు జిల్లాలో 7,882, తిరుపతి జిల్లాలో 18,262 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను ఉచితంగా తొలిరోజు క్యాంపులో అందజేశారు. వివిధ విద్యాసంస్థల్లో అడ్మిషన్ల సమయం కావడంతో జగనన్న సురక్ష క్యాంపులను వినియోగించుకున్నామని విద్యార్థులు సంతోషం వ్యక్తంచేశారు. సచివాలయాల్లో అందుబాటులో ఉన్న దరఖాస్తులను పూర్తిచేసి చాలామంది రైతులు సీసీఆర్సీ కార్డులు పొందారు. రైతుల్లో ఉన్న ఆందోళనను దూరం చేసి, కౌలు రైతులకు మేలు చేకూర్చడంలో క్యాంపులు బాగా ఉపయోగపడ్డాయని సంతోషం వ్యక్తంచేశారు.

నిత్యం పర్యవేక్షణ



తిరుపతి జిల్లా పరిధిలో ఈ నెలాఖరు వరకు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఆయా సచివాలయాల్లో జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నాం. క్యాంపుల నిర్వహణ తేదీని ప్రజలకు ముందస్తుగానే వలంటీర్ల ద్వారా తెలియజేస్తాం వారు వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నాం.

– కె.వెంకటరమణారెడ్డి, కలెక్టర్, తిరుపతి

గంటలో రేషన్ కార్డు



మాది విజయపురం మండలం మిట్టూరు గ్రామం. రేషన్ కార్డు విభజించి ఇవ్వాలని జగనన్న సురక్ష క్యాంప్‌లో అర్జీ ఉంచుకున్నాను. గంట సమయంలో రేషన్ కార్డు విభజన చేసి నాకు కొత్త కార్డు అందించారు. ముఖ్యమంత్రి జగనన్నకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

– హిమబిందు, విజయపురం

అప్పటికప్పుడే బర్త్ సర్టిఫికెట్



గతంలో నేను నా బర్త్ సర్టిఫికెట్ కోసం ఎన్నో సార్లు తిరిగినా అందలేదు. ప్రస్తుతం జగనన్న సురక్ష సర్వేలో నా వద్ద సర్వేకు వచ్చిన వారికి నా సమస్యను విన్నవించుకున్నా. బర్త్ సర్టిఫికెట్‌కు వారు అడిగిన పత్రాలు అందజేశా. ఎలాంటి ఖర్చు లేకుండా సురక్ష క్యాంప్‌లో బర్త్ సర్టిఫికెట్ అందజేశారు.

– దుర్గ, పుత్తూరు

తుది దశకు శ్రీనివాస సేతు



పనులను పరిశీలిస్తున్న కమిషనర్, డిప్యూటీ మేయర్

తిరుపతి తుడా:నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న శ్రీనివాస సేతు ఫ్లైఓవర్ తుది దశకు చేరుకుంది. ఆదివారం రామానుజ సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్‌ను కలుపుతూ, రైల్వేలైన్‌పై రెండు మార్గలకు ఐరన్ గెడ్డర్లు ఏర్పాటు చేసే ప్రక్రియ చేపట్టారు. తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, రైల్వే ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ ఫ్లై ఓవర్ పనులు దాదాపు పూర్తయినట్లు వెల్లడించారు. త్వరలోనే నగరవాసులకు శ్రీనివాస సేతును అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. డిప్యూటీ మేయర్ అభినయ్ రెడ్డి మాట్లాడుతూ రైల్వే లైన్‌పై శ్రీనివాస సేతును కలిపే కీలక ప్రకియలో భాగంగా 6 భారీ గెడ్డర్లను ఏర్పాటు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం రెండు గెడ్డర్లను అమర్చారని వెల్లడించారు.

తొలగించిన విగ్రహాలను ఏర్పాటు చేస్తాం

శ్రీనివాస సేతు నిర్మాణ పనుల్లో భాగంగా తొలగించిన మహనీయుల విగ్రహాలను తిరిగి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం కమిషనర్‌తో కలిసి పలు కూడళ్లను పరిశీలించారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, కార్పొరేటర్ లడ్డు భాస్కర్, తిరుపతి రైల్వే స్టేషన్ అధికారులు కుప్పాల సత్యనారాయణ, కృష్ణ, సుబ్బారావు, అఫ్కాన్ స్వామి పాల్గొన్నారు.

క్లుప్తంగా

భావితరాలకు తాళపత్రాల్లోని జ్ఞానం

తిరుపతి ఎడ్యుకేషన్ : పూర్వీకులు తాళపత్రాల్లో నిక్షిప్తం చేసిన జ్ఞానాన్ని భావితరాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు టీటీడీ జేఈఓ సదా భార్గవి తెలిపారు. తిరుపతిలోని ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో ×మాన్ స్క్రిప్ట్ డిజిటైజేషన్ టెక్నాలజీస్‌పై ఏర్పాటు చేసిన రెండు రోజుల జాతీయ సదస్సు ఆదివారంతో ముగిసింది. జేఈఓ మాట్లాడుతూ టీటీడీ ఆధీనంలోని తాళపత్రాలను డిజిటలైజ్ చేసి అందరికీ అందుబాటులో ఉంచేందుకు ఈఓ ఏవీ ధర్మారెడ్డి ఆదేశాల మేరకు ఏడాది క్రితం మాన్ స్క్రిప్ట్ ప్రాజెక్టు ప్రారంభించామన్నారు. ప్రస్తుతం డిజిటైజేషన్ పనులు వేగవంతంగా సాగుతున్నట్లు వెల్లడించారు. ఇందుకు సహకరించిన పండితులకు, ప్రాజెక్టు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. డిజిటైజేషన్ పూర్తయిన తాళపత్రాలను పుస్తక రూపంలోకి తీసుకువస్తామని వివరించారు.సదస్సులో వేద వర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాణి సదా శివమూర్తి, తాళపత్రాల దాత రాజేంద్రప్రసాద్ దయామ, ప్రొఫెసర్ పీవీ వాసుదేవ, మాన్ స్క్రిప్ట్ ప్రాజెక్టు ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రాధేశ్యామ్ పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పొంగళ్లు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చిల్లకూరు: తూర్పు కనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు పొంగళ్లు పొంగళ్లు అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఉదయం ముత్యాలమ్మకు విశేష అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ సిద్దారెడ్డి దేవసేనమ్మ, ఈఓ నవీన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. వారు మాట్లా డుతూ ఇకపై ప్రతి పౌర్ణమికి ఆలయంలో చండీయాగం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

పునీతం.. అగ్నిగుండ ప్రవేశం


అగ్నిగుండం వద్దకు తరలివచ్చిన అమ్మవారు, చిత్రంలో ముక్కంటి ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు


అమ్మవారి ఒడిలో నిప్పులు కదుతున్న అర్చకుడు

- వైభవంగా ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి బ్రహ్మోత్సవాలు
- స్వామి, అమ్మవార్ల దర్శనానికి పోటెత్తిన భక్తులు
- పెద్దసంఖ్యలో పొంగళ్లు పొంగించిన మహిళలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా చెన్నైరోడ్డులో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం దుర్యోధన దుశ్శాసన వధ ఘట్టాన్ని ప్రదర్శించారు. మట్టితో తయారు చేసిన దుర్యోధన, దుశ్శాసన బొమ్మలపై భీముడి వేషధారి కదం తొక్కడం భక్తులను ఆకట్టుకుంది. అంతకు ముందుగా ఆలయంలో నూతన కుండపై స్వామివారి ఖడ్గాన్ని నిలబెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆలయానికి ఎదుట అగ్నిగుండాన్ని వెలిగించారు. అమ్మవారి వస్త్రంలో తెచ్చిన నిప్పులతో అగ్ని రాజేశారు. భక్తులు సైతం తాము తెచ్చిన కట్టెలను అగ్నిగుండంలో సమర్పించుకున్నారు. పెద్దసంఖ్యలో మహిళలు పొంగళ్లు పొంగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల తర్వాత అంతటి స్థాయిలో ధర్మరాజస్వామి ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహోత్సవాలను జరిపించే అవకాశం దక్కడం పూర్వజన్మ సుకృతమని తెలిపారు. మహాభారత ఘట్టాలను ప్రజల కళ్లకు కట్టినట్టు కళాకారులు ప్రదర్శించారని కొనియాడారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. స్త్రీపురుషులకు వేర్వేరుగా క్యూలు నిర్వహించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారని వెల్లడించారు. పటిష్ట బందోబస్తు కారణంగా తోపులాటలు, తొక్కిసలాటలు లేకుండా ప్రశాంతంగా అగ్నిగుండ ప్రవేశం జరిగిందని వివరించారు.


అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న మాలధారులు

బంగారం ధరలు



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,130
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,400

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.71,400
రిటైల్ వెండి గ్రాము	రూ.73.40

ఈసెట్‌లో తిరుపతి విద్యార్థులకు ర్యాంకులు


జి.ప్రవీణ్‌కుమార్


యు.కుసుమ


టి.భానుప్రియ

తిరుపతి ఎడ్యుకేషన్ : డిప్లమో పూర్తి చేసి ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించిన ఈసెట్ ఫలితాల్లో తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపల్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈసీఈ విభాగంలో జి.ప్రవీణ్‌కుమార్ రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు, ఈఈఈ విభాగంలో పి.వీరశివారెడ్డి 6వ ర్యాంకు, పి.జాహ్నవి 13, టి.నూతన్‌కుమార్ 26, ఎ.వెంకటసాయి శ్రావణ్ 28, ఎం.విష్ణుతేజ 38, ఫార్మసీ విభాగంలో యు.కుసుమ 4, టి.భానుప్రియ 9, ఎం.హరిప్రియ 10వ ర్యాంకు సాధించినట్లు వివరించారు.

కెనడా కవితల పోటీల్లో పేరూరుకు బహుమతి


బాలసుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: తెలుగు తల్లి కెనడా మాసపత్రిక కెనడా డే సందర్భంగా ప్రతి ఏటా నిర్వహించే అంతర్జాతీయ కవితల పోటీల్లో 2023వ సంవత్సరానికి సంబంధించి తిరుపతికి చెందిన కవి, కథా రచయిత పేరూరు బాలసుబ్రమణ్యం విజేతగా నిలిచారు. ఆయన రాసిన ప్రాణ దాతలు కవితకు బహుమతి లభించింది. 2020లో కథల పోటీల్లో ఆట గదరా శివా అనే కథకు కూడా కెనడా డే పోటీల్లో బహుమతి అందుకున్నారు. ఈ మేరకు పేరూరు బాలసుబ్రమణ్యంను తెలుగు భాషోద్యమ సమితి, అరసం నేతలతోపాటు, సాహితీవేత్తలు, సాహితీ ప్రియులు అభినందించారు.

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ప్రజల సౌకర్యార్థం అర్జీలు రాసేందుకు ప్రత్యేకంగా ముగ్గురు వీఆర్‌ఓలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్పందనకు అన్నిశాఖల ఉన్నతాధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.

ది బెస్ట్‌గా 'బర్డ్'

- అందుబాటులో అత్యుత్తమ వైద్యసేవలు
- టీటీడీ జేఈఓ సదా భార్గవి
- ముగిసిన ఆర్థో ప్లాస్టీ జాతీయ సదస్సు

తిరుపతి తుడా: తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రిని బెస్ట్‌గా తీర్చిదిద్దినట్లు టీటీడీ జేఈఓ సదాభార్గవి తెలిపారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో మూడు రోజులపాటు నిర్వహించిన జాతీయస్థాయి ఆర్థో ప్లాస్టీ సదస్సు ఆదివారంతో ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన జేఈఓ మాట్లాడుతూ బర్డ్ ఆస్పత్రిలో ప్రపంచ స్థాయి వైద్య ప్రమాణాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆర్థోపెడిక్ సమస్యలతో బాధపడుతున్న రోగులు బర్డ్‌లో మెరుగైన చికిత్సలు పొందాలని సూచించారు. మోకీలు, తుంటి మార్పిడికి సంబంధించి అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్నారని వెల్లడించారు. ప్రముఖ వైద్యులతో 22 మంది పేద రోగులకు క్లిష్టమైన సర్జరీలను లైవ్‌లో చేశారని తెలిపారు. దేశవ్యాప్తంగా దాదాపు 200 మంది యువ సర్జన్లు ఈ సదస్సులో పాల్గొని లైవ్ ఆపరేషన్లను వీక్షించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారన్నారు. మూడు రోజుల్లో 22 క్లిష్టమైన ఆపరేషన్లు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ సదస్సును విజయవంతంగా నిర్వహించిన బర్డ్ ప్రత్యేకాధికారి డాక్టర్ రాచపల్లి రెడ్డెప్పరెడ్డి, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ దీపక్ బృందానికి జేఈఓ అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని జాతీయ సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇంత చక్కటి సదస్సును నిర్వహించేందుకు ఆమోదం తెలిపిన టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బర్డ్ ప్రత్యేకాధికారి డాక్టర్ రాచపల్లి రెడ్డెప్పరెడ్డి మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అనేక మంది వైద్య నిపుణులు బర్డ్‌కు వచ్చి పేదలకు ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నారన్నారు. సేవ చేయడానికి ముందుకొచ్చే డాక్టర్లకు వసతి, రవాణా, భోజనం, తిరుమల శ్రీవారి దర్శనం కల్పిస్తున్నట్లు వెల్లడించారు.



మాట్లాడుతున్న టీటీడీ జేఈఓ సదాభార్గవి

హిప్ రీప్లేస్‌మెంట్ నిపుణుడు, హైదరాబాద్ మెడికవర్ ఆస్పత్రి హెచ్ఓడీ డాక్టర్ కృష్ణ కిరణ్ మాట్లాడుతూ సదస్సులో యువ వైద్యులకు సందేహాలను తీర్చడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఇండియన్ ఆర్థో ప్లాస్టీ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ రాజ్ కుమార్ నటేశన్, ఏపీ ఆర్థోపెడిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ సునందకుమార్ రెడ్డి, మెడికల్ కౌన్సిల్ అబ్జర్వర్ డాక్టర్ సుబ్బారెడ్డి, బర్డ్ వైద్యులు ప్రదీప్, వేణుగోపాల్, దీపక్, మెరిల్ సంస్థ ప్రతినిధి డాక్టర్ వివేక్ పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించవలసిన బాధ్యత పాఠకులదే. మా పాఠకులకు కోరడమైనది. ప్రకటనదారుల తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

విద్యుదాఘాతంతో ఇద్దరికి తీవ్రగాయాలు

తిరుపతి రూరల్ : మండలంలోని అవిలాల శానప్పకాలనీలో ఆదివారం విద్యుదాఘాతానికి గురై ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రోశయ్య నిర్మిస్తున్న భవనంలో కృష్ణాజిల్లాకు చెందిన డేవిడ్, స్టీఫెన్ సెంట్రింగ్ పనులు చేస్తున్నారు. ఇంటి పైన వెళుతున్న 33 కేవీ విద్యుత్ తీగలకు వారి చేతిలోని ఇనుపరాడ్ తగలడంతో ప్రమాదం జరిగింది. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. గాయాలు తీవ్రంగా ఉండడంతో మరో ప్రైవేట్ ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్రమణ్యంరెడ్డి తెలిపారు.

విద్యుత్ తీగల కిందే నిర్మాణం!

కాలనీలో 33 కేవీ విద్యుత్ తీగల కింద విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రోశయ్య ఇంటి నిర్మాణం చేపట్టారు. దీనిపై స్థానికులు పంచాయతీ కార్యదర్శి కరుణశ్రీకి ఫిర్యాదు చేశారు. ఆమె కనీసం స్పందించలేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. పైగా రోశయ్య తదితరులు తమపై ఘర్షణకు దిగినట్లు వెల్లడిస్తున్నారు. అనంతరం కలెక్టర్ ఫిర్యాదు చేయడంతో పంచాయతీ కార్యదర్శి సైతం తమపై మండిపడినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఇద్దరు కార్మికులు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సక్రమంగా విధులు నిర్వర్తించని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తడ : మండలంలోని కొండూరు గ్రామంలో అప్పుల బాధ తాళలేక శనివారం ఆత్మహత్యకు యత్నించిన మీంజూరు మణెమ్మ(52) అనే మహిళ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి కేసులో నలుగురి అరెస్ట్

నాయుడుపేటటౌన్ : మండలంలోని కారుమంచివారి కండ్రిగ గ్రామానికి చెందిన ఎల్లా రాధాకృష్ణ అనే వ్యక్తిపై జూన్ 28వ తేదీన దాడి చేసిన కేసులో నలుగురు నిందితులను శనివారం రాత్రి అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలోని యాలయకోట క్రాస్ రోడ్డు వద్ద డీఎస్పీ ఆధ్వర్యంలో పుదూరుకు చెందిన నిందితులు గురురత్నం, మణి, కోటి, దావూద్‌ను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు.

కన్నీళ్లు మిగిల్చిన తిరునాళ్ల

- నీటిగుంటలో పడి ఇద్దరు చిన్నారులు మృతి
- వరదరాజస్వామి ఉత్సవాల్లో అపశ్రుతి



చిన్నారుల మృతదేహాలు

కేవీబీపురం: తిరునాళ్ల ఆ కుటుంబాల్లో కన్నీళ్లను మిగిల్చాయి. ఊరుగాని ఊరు వచ్చి నీటి గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతిచెందడంతో స్థానికంగా ఆదివారం తీవ్ర విషాదం అలముకుంది. స్థానికుల కథనం.. విజయపురం మండలంలోని యల్లసముద్రం గ్రామానికి చెందిన కోదండం, సులోచన దంపతులతోపాటు తమ కుమారుడు హేమంత్(9), నాగలాపురం మండలం, యాంబాకం గ్రామానికి చెందిన రామచంద్ర, లక్ష్మి దంపతులతోపాటు తమకుమారుడు కుమారుడు చందు(07)తో కలిసి బంధువుల గ్రామం మారప్పరెడ్డి కండ్రిగలో జరుగుతున్న వరదరాజులస్వామి జాతరకు హాజరయ్యారు. ఈ క్రమంలో తమ కుమారులు ఆటలాడుతూ జాతర జరుగుతున్న ప్రదేశానికి సమీపంలోని నీటిగుంటలో కాలుజారి పడిపోయారు. కొంతసేపటి తర్వాత చిన్నారులను గుర్తించి స్థానికులు వెలికితీశారు. 108లో చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. అప్పటికే చిన్నారులు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనతో మారప్పరెడ్డికండ్రిగతో పాటు యల్లసముద్రం, యాంబాకం గ్రామాల్లో విషాదం అలుముకుంది.

మీడియా పేరుతో బెదిరింపులపై కేసు

తిరుమల : మీడియా పేరుతో బెదిరిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న నలుగురిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు తిరుమల టుటౌన్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. వివరాలు.. ఇటీవల పరకామణిలో చోరీకి పాల్పడిన కేసులో నిందితుడు రవిని ప్రైమ్ 3 న్యూస్ చానల్ రిపోర్టర్లు సూర్యనారాయణ రాజు, సునీల్ చక్రవర్తి. కెమెరామెన్లు వెంకటరత్నం అలియాస్ చంటి, బాలు బెదిరించే ప్రయత్నం చేశారు. రవి అక్రమాలపై ఆధారాలు ఉన్నాయని వాటిని మీడియాలో ప్రసారం చేయకుండా ఉండాలంటే రూ. 50 లక్షలు ఇవ్వాలంటూ బెదిరింపులకు దిగారు. దీనిపై రవి వెంటనే పోలీసులను ఆశ్రయించాడు. తగిన ఆధారాలు సమర్పించడంతో ఎస్పీ పరమేశ్వర్రెడ్డి ఆదేశాల మేరకు క్రైమ్ నెం .90/2023 మేరకు సెక్షన్ 384, 506, రెడ్ విత్ 34 కింద నిందితులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు ముగ్గురిని అరెస్ట్ చేయగా వెంకటరత్నం అలియాస్ చంటి పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. వీరు గతంలో కూడా అనేక మందిని బెదిరించి డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం ఉందన్నారు. ఈ క్రమంలో నిందితులు స్టేషన్ బెయిల్‌పై విడుదలైనట్లు తెలిపారు.

హోరాహోరీగా తైక్వాండో పోటీలు


తైక్వాండో క్రీడాకారులతో నిర్వాహకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని ఎస్వీ వైద్య కళాశాల ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా తైక్వాండో చాంపియన్‌షిప్-2023 పోటీలు హోరాహోరీగా సాగాయి. సబ్ జూనియర్స్, క్యాడెట్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో జరిగిన పోటీల్లో విజేతలకు బంగారు, రజతం, కాంస్య పతకాలు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం జిల్లా కార్యదర్శి శ్రీధర్, తైక్వాండో సంఘం జిల్లా అధ్యక్షుడు గురవారెడ్డి, ఉపాధ్యక్షుడు కె.గోపినాయుడు, కోశాధికారి బి.యుగంధర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులు శ్రీను, లోక, మోహన్, కోచ్‌లు దాము, ప్రదీప్, నరేంద్ర పాల్గొన్నారు.